


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

14

(ఆగస్టు 17,'76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

"**ప్రతివాళ్ళకీ ఊరికే మాట ఇచ్చేస్తారు.** ఆ పనులు కాకపోతే మర్యాదగా ఉంటుందా! చెయ్యగలవాటికే మాట ఇవ్వాలి. లేదా 'నా వల్లకాదని చల్లగా చెప్పేస్తే' వాళ్ళు మెల్లగా జారుకుంటారు. మాట ఇచ్చి వాళ్ళనిలా తిప్పడం దేనికండీ! దుప్పటి కప్పుకుని పడుకుంటే హాయిగా గుర్రుకొట్టి నిద్రపోవచ్చుగదా?" అని ఒకామె భర్తని మందలించటానికి ప్రయత్నించింది.

కానీ అలా చెపితే వింటారా! కొందరికి అలా మాట ఇవ్వడంలో ఎంతో సరదా ఉంటుంది. "ఫలానా పని మీ వల్ల అవుతుందా?" అంటే చాలు. "దానిదేం ఉంది. మీకు ఎవరితో పనివుందో ఆయన ఇప్పుడే వచ్చివెళ్ళాడు. అరగంట క్రింద మీరు వస్తే ఆ పని ఇక్కడే అయిపోయేది" అంటూ ఉంటారు.

"బయలుదేరడం గంటకు ముందే బయలుదేరామండీ! దోవలో కొంచెం కాఫీ కోసం కక్కుర్తిపడ్డాం. అందువల్ల వచ్చింది ఆలస్యం. అరరే!" అని అవతలవాళ్ళు ఎంతో పశ్చాత్తాపం చెందుతారు. తాగిన కాఫీని – దాన్ని అందించిన హోటల్నీ ఎంతగానో దుమ్మెత్తి పోస్తారు.

"సరేలెండి అయిన దానికేం చేస్తాం! ఆయన మళ్ళీ రేపు సాయంత్రం వస్తాడు. వచ్చి తీరతాడులెండి. ఆయనకు నాతో చాలా పని ఉంది. రాగానే చెప్పి చేయిస్తాను. మళ్ళీ ఎప్పుడు కనపడం?" అంటారు.

అసలు ఆ వ్యక్తి చెప్పవలసిన జవాబు "మీ రోగం కుదిరేదాకా" అని. కానీ అలా చెప్పడు. నిజానికి ఆయన మాట నమ్మి తిరగాలంటే బ్రతికి ఉన్నంత కాలం తిరగాలి. లేదా ఎవరితో పని ఉన్నదో ఆయన కీర్తిశేషుడన్నా కావాలి. అందాకా తిరగడమే ఆయన కర్తవ్యం.

***<u>బదిలీల నుంచి బారసాల బ్రాహ్మడిదాకా</u>***

అలా ఆ వ్యక్తులు చేసి పెడతామని ఇచ్చే హామీలలో ఎన్నిరకాలు ఉంటాయి. ఏ ఒక్క శాఖకూ పరిమితమై ఉండవు. తనకు తెలిసిన విషయాలకు మాత్రమే పరిమితమై అంతకన్నా ఉండవు.

"కొంచెం మా వాడికి బదిలీ కావాలండీ! చాలా అవస్థపడుతున్నాడు. పెళ్ళాం ఒకచోట, పిల్లలు ఒకచోటా – అతడొక చోటా.. విసిరేసినట్లు పడివున్నారు. విసుగుపుట్టి ఉద్యోగం మానేస్తానంటున్నాడు. ఎలాగైనా మీరు పుణ్యం కట్టుకోవాలి అంటే – 'అదెంతపనిలెండి. అయితే ఒక్క వారం వ్యవధి ఇవ్వండి. నాకీ వారంలో అయిదునిముషాలు తీరుబడిలేదు. తర్వాత ఆర్డరు వేయించి, మీ ఇంటికి పంపిస్తా. అక్కడున్న వాళ్ళంతా ఎరుగున్నవాళ్ళే. మొన్ననే అడిగిపోయారు – "ఏమీ చెప్పడం లేదేం సార్! మా విషయంలో మొహమాట పడకండి. మీకు చెయ్యకపోతే ఎవరికి చేస్తాం" అని? అంటూ వచ్చిన వాళ్ళనోట్లో దోసెడు పంచదార పోస్తాడు.

వాళ్ళు తియ్యగా చప్పడిస్తూ చేతులు ముకుళించి, కళ్ళు పెద్దవి చేసుకుని ఏం చెప్పాలో తోచక కుర్చీకి అతుక్కుపోతారు గోడమీద బల్లుల్లాగా. తడికి కంతలో కాలు ఇరుక్కుపోయిన పిల్లుల్లాగా!

ఈ హామీలివ్వడం - ఒక్క బదిలీల విషయంలోనే కాదు. బారసాల తలపెట్టాం అనగానే "అలాగా అయితే బ్రాహ్మణ్ణి నేను పిలుచుకు వస్తాను. చక్కగా మంత్రాలు చెపుతాడు. నీత్రిగిత్తీ ఏంలేదు. మొన్ననెప్పుడో చెప్పాడు - ఇప్పటికి నాలుగువందల యనభై మూడు బారసాలలు చేయించాడు. " ఎన్ని ఉపనయనాలు చేయించిందీ, ఎన్ని బారసాలలు చేయించిందీ - అంతా పద్దు ఉంటుంది.

"పైగా నోటివాసి మంచిది. మంత్రం చెప్పాడంటే ఎంతో మంగళప్రదంగా సాగిపోతోంది అవతలవాళ్ళ జీవితం. ఒక్క బారసాలకు మంత్రం చెప్పాడంటే - పదిబారసాళ్ళదాకా బండి సాగిపోవలసిందే పైగా ఆయన బారసాల చేయించిన పిల్లలందరూ పెద్ద వాళ్ళయి చదువుతున్నారా! వాళ్ళ ఆదరణ - అదే తమాషా కాలేజి ఫస్టో, యూనివర్సిటీ ఫస్టో.. అలా రావలిసిందే" అంటూ హామీ ఇస్తాడు - అతి ధైర్యంగా నిజంగా తీసుకు వస్తాడుగావన్ను. అలాటి బ్రాహ్మణ్ణి - సంతాన నిరోధకాలంలో, ఏమి బెడద తెచ్చి పెడతాడోననే భయం ఏర్పడినా - ఆయనగారి సేవాభావం చూసి - మౌనముద్ర వహించక తప్పదు.

***<u>తాత్కాలిక శాంతికి మాటలు మాత్రలు</u>***

మాట ఇచ్చాంగదా అనే బాధ చాలామందికి ఉండదు పాపం. తాత్కాలిక శాంతి కోసం. డోకుమందు, తలనొప్పి మందు కడుపునొప్పి మందూ వాడినట్లు - ఆ మాటల్ని మాత్రలు చేసి - చక్కగా మింగిస్తారు. ఈ రకం వైద్యంలో వారు సిద్ధహస్తులు. రోగ నివారణ విషయం వారు ఆలోచించనూ లేరు, ఆ రోగం కుదర్చనూ లేరు. అయితే మరో రకంగా కుదురుస్తారనుకోండి. అది వేరే ప్రక్రియ.

నిజానికి ఇలాటి వైద్యం కోరే వారుకూడా కొందరుంటారు. ప్రతి చిన్న విషయానికి గోడకూలిపోయినట్లుగా, మేడలు పడిపోతున్నట్టుగా గొడవ చేస్తూ బయలుదేరుతుంటారు. వారికి పైన చెప్పిన రకం చిట్కా వైద్యం వల్ల కొంత మనశ్శాంతి కలుగుతుంది. కొంత రొద తగ్గుతుంది.

మనిషికొక రకం వెర్రి ఉండటం దాన్ని తెచ్చి ఎదుట వాళ్ళకు రుద్దడం - వాళ్ళు చలికాలంలో కూడా చెమటతో ముద్దముద్దయి పోవడం జరుగుతూ ఉంటుంది. అలాటి వాళ్ళను చూస్తే సామాన్యంగా అందరికీ భయమే గాని - పైన చెప్పిన రకం ప్రయివేటు డాక్టర్లు చక్కగా - క్షణంలో కుదిర్చి పంపుతారు.

కొందరు అసలు డాక్టర్లు కూడా మాటలతో సగం రుగ్మతను పోగొట్టగల శక్తి గలవారుంటారు. ఆదరణతో, కొంచెం హాస్యంతో, ఆప్యాయతతో మాట్లాడి - తర్వాత మందిచ్చి పంపుతారు.

అలాటి డాక్టర్ల వద్దకు చాలామంది మందుకోసం కంటే మాటలకోసం ఎక్కువ వెడుతూ ఉంటారు. మరికొందరు ఆ మాటలకోసం ఏవో చిన్న చిన్న జబ్బులు వెతుక్కుని వెళ్ళి కూర్చుంటారుకూడా? అలాటివారి విషయంలో "మందు గొప్పో మాట గొప్పో" అనే సందేహం కూడా ఏర్పడుతూ ఉంటుంది.

***<u>నత్తి మాటలతో తలనాదు రాదనా?</u>***

మా మల్లినాథసూరిగారొకసారి డాక్టరు గారి దగ్గరకు వెళ్ళి "సార్.. మా ఆవిడకు త..త..తల నా..నా..నా..నాదుగా ఉంది. ట. మ..మ...మందు ఇ..ఇ..ఇ..ఇస్తారా" అన్నారుట.

డాక్టరు అంతవరకూ ఓపిక పట్టి విని "ఈ కాసేపట్లో నాకే వచ్చింది తలవాదు. నీతో కాపరం చేసే ఆవిడకు ఎందుకు రాదూ - అందులో ఇవ్వాళ ఆదివారం కాదూ. ఆఫీసుకు పోలేదు గావను.. నత్తి మాటలు విని, అర్థంచేసుకోవడంలో అంత తలనాదు ఉంది. పైగా ఆవిడ ఏదో పనిలోనో పరధ్యానం లోనూ ఉండగా - చెప్పడం ప్రారంభిస్తావుగావున్ను" అన్నాడట డాక్టరుగారు.

ఆ మాటతో మల్లినాథులకు కోపం వచ్చిందిట. దానితో పాటు నత్తి హెచ్చిందిట. ఆయన అన్నారుట ''మా..మా.ఆ..ఆఆ..విడకు. పర..పర..పర..ధ్యానం..ధ్యాన్న..న్నమే..ట..ట..టండి..న్నే..అంటే ఎంత... ఎంత... భయభక్తో... క్తో తెలుసా'' అని.

డాక్టరుగారు నవ్వి ''భక్తి అయితే మాత్రం పరధ్యానం ఉండకూడదుటయ్యా. ఏ కూరవిషయమో అందులోకి కావలసిన కారం విషయమో మరో ఇతర విషయమో ఆలోచిస్తూ ఉండకూడదూ.. భర్తనని నిన్ను తలుచుకుంటూ సంసారాన్ని, సంతానాన్ని వదులుకోమంటావేమిటి'' అన్నారుట.

మల్లినాథులు గోడగడియారం వంక చూచి ''ఇం..ఇం..తకీ.. మా..మా..త్రలిస్తారా లేదా?'' అన్నాడుట. డాక్టరుగారు అయిదు మాత్రలు పొట్లం కట్టి ఇచ్చి నువ్వు ఇంట్లో ఉన్నప్పుడే ఇవి వాడు. బయటకు వచ్చేముంది ఆమెగారికి తలనాదుగా ఉన్నా వాడక్కరలేదు. నువ్వు ఇవతలకు రాగానే ఆగిపోతుంది. ఆవిడకు బాగా పట్టిచ్చే మందదే' అన్నారుట.

''మాత్ర..లకం...టె.. మాటలు.. ఎక్కువ.. నేర్చారు.. డా..డా..డా'' అంటూ బయటకు వచ్చారుట.. వీధి గుమ్మం దాటినప్పుడు తక్కిన మాట 'క్టరు' బయటకు రావడం వాక్యం పూర్తికావడం జరిగిందట.

''మాటలతో విందు.. మాటలతో మందూ'' అనే సామెత ఉంది. దీని క్రింద అనేక ఉదాహరణలివ్వచ్చు.

Comment on this article..